కథానిక

# పరిస్థితుల బానిస

తిరునగర్

వస్తువు చవకగా వస్తుందంటే వేలంవెర్రి-"నిజానికి ఇంత ఇల్లుండగా వేరే ఇంకో ఇల్లు ఎందుకు చెప్పండి?" అని అడిగింది అమ్మ నాన్నని. "పోనీలే! దానికివచ్చే అద్దె వడ్డీకంటే తక్కువేమీ వుండదు" అంటాడు నాన్న. ఏదెలావున్నా దాన్ని బాగుచేయించే భారమంతా చివరికి నామీనపడింది. ఆ శిథిలగృహంలో అటక మీద ఓ పెట్టె దొరికింది. అది నాకుమాత్రం చాలా విలువైంది. దాంట్లో కాగితాలు, ఏవేవో అల్లిక గుడ్డలూ తప్ప వేరేమీ లేవనుకోండి. కాని ఆ కాగితాల్లో సాహిత్యపరంగా అనండి లేదా వాస్తవికమైనవే అనండి చాలా విలువైనవే వున్నాయి. ఆ పెట్టెలో దొరికిన కాగితాల్లో "ఉత్తరం"ఒకటి. ఇది నిజమని నేను నమ్మలేదు. అలాంటప్పుడు దాన్ని మీరు నమ్మకపోయినా బాధపడను. అసలు ఇది సత్యమో, అసత్యమో నిర్ణయించే బాధ్యత మీమీదనే వుంచుతాను. ఇంతకుముందు ఆ యింట్లో వున్నవాళ్ళల్లో ఎవరైనా కథలురాసేవాళ్ళున్నారేమో; వాళ్ళు రాసి వుండవచ్చు. లేదా నిజంగానే ఏ చెల్లెలో అక్కయ్యకు రాసివుండవచ్చు. ఆ అక్కయ్య వుండే ఇల్లు ఇదేకావచ్చు. ఇది నిజమనుకుంటే పాపం! అభాగ్యురాలు "రాధ"కోసం ఓ కన్నీటి కణం విడువండి. కాదనుకొంటే ఓ అనామకుడు రాసిన కథనుమల్లే చదివిపారేయండి. అంతే! ఆ వుత్తరాన్ని యథాతథంగా మీముందుంచుతాను.

అక్కయ్యకు—

పరిస్థితుల ప్రభావాలకు పరివర్తనం చెందని ప్రాణి ప్రపంచంలోనే లేదేమో! అందుకే ముఖ్యంగా పరిస్థితులకు విపరీతంగా లొంగిపోయే మానవత్వాన్ని నిర్దుష్టంగా నమ్మలేము.

హృదయమంతా పాపభారంతో బరువెక్కినప్పుడు నీతోనన్నా చెప్పుకొని ఈ అఘజనిత భారాన్ని తగ్గించుకోనివ్వు. ఈ వుత్తరం నీకందే సరికి నేనెలా, ఎక్కడుంటానో చెప్పలేను. విధాత పాపాన్ని క్షమిస్తాడా? ఆయన క్షమాభిక్ష నేను కోరను. దానికి అనర్హురాల్నని విషయంగూడా నాకు తెలుసు.. తప్పులుచేసిన ప్రతివాళ్ళూ క్షమాపణ వేడుకుంటారు. కాని పాపానికి నేనెప్పుడూ వెరవలేదుగనక దాని ఫలితానికీ నేనెప్పుడూ భయపడను. "ఫలానాది పాపం"అని ఎవరు నిర్ణయించారు చెల్లీ అంటావేమో! నిజమే. ఎవరూ నిర్ణయించలేదు. కాని ఈ ఆత్మ కొన్ని కట్టుబాట్లలో నడుస్తుంది. దాన్ని వ్యతిరేకించి, ఆత్మకు అనిష్టమైన పనిని చేయడమే పాపం! పరలోకం వుందో లేదో మనకనవసరం. ఆత్మకిష్టంగాని పనిచేసినప్పుడది హృదయాన్ని రాపిరంపాన పెడుతుంది. అదే నరకం.

నేనూ నీకుమల్లే పెరిగితే నా జీవితం ఇంత శోచనీయంగా వుండేదికాదేమో? మన మానసిక వ్యవస్థే నరకాన్నీ, స్వర్గాన్నీ సృష్టిస్తుందనే సత్యం నీవు గ్రహించావు. నీవు చెప్పిన సుభాషితాల్లో ఏఒక్కటైనా చెవికెక్కించుకొనివుంటే ఈనాడు జీవితం యింత దుర్భరంగా వుండేదికాదు!

అవి నేను కాలేజీలో చదువుకొనేరోజులు. తోటివాళ్ళనుమాచి "అనుకరించటం" అప్పటికి అలవాటైపోయింది. పాశ్చాత్య నాగరికత నరనరాలకూ వ్యాపించింది. ఆ వాతావరణానికి ఎంతగా మాత్తుకుపోయానంటే, మనవూళ్ళో బయటికి రావడానికి సిగ్గుపడే నేను మగాళ్ళల్లో కూర్చొని "కేరమ్సు"ఆడేంతవరకు.

ఆవాళ కాలేజీనుంచి రాగానే ముఖం కడుక్కొని టాయిలెట్ అవుతున్నాను. ఇంతలో కారు హారన్ వినిపించింది. ఎవరోనని కిటికీలోంచి చూస్తూవుండగానే తలుపు తోసుకొని శారద గదిలోకి వచ్చింది.

"ఎక్కడికైనా ప్రోగ్రాంవుందా ఏం? టాయిలెట్టవుతున్నావు?"అంది.

"అహాఁ లేదోయ్" అన్నాను అద్దంలో ముఖం చూసుకొంటూ.

"అయితే ఫరవాలేదు."

"ఏవిటి విశేషం?"

"బీచికి వెళదామని."

"నాకూ ఏమీ తోచకుండా వుందివ్వాళ కద" అన్నాను.

చిన్న కార్లో పద్మావతి, కృష్ణారావు, భాను మూర్తి కూర్చునివున్నారు.

"హాల్లో మిస్ రాధా" అంటూ కృష్ణారావు చేతిని నాకందిచ్చాడు.

"హాల్లో" అంటూ అతని చేతినిపట్టుకొని కార్లో ఎక్కాను.

కారు సరాసరి బీచికి వెళ్ళి ఆగింది. అందరం కార్లోంచి దిగాం. ఐదుగంటలవుతోంది. సంధ్యా సమయపుప్రకృతి వింతగాగోచరిస్తోంది. సముద్రపు కెరటాలు ఉవ్వెత్తుగా వస్తున్నాయి. వాటికిమల్లే శరీరమంతా పొంగిపోతోంది. సముద్రంమీదినుంచి చల్లగాలివీస్తూ శరీరంలోంచి పులకలు లేవదీస్తోంది. కృష్ణారావు లేచివెళ్ళి కెరటాలతో తడిసిపోయిన ఇసుకలో పిచ్చుకగూళ్లు కడుతున్నాడు. అతని లోంచి ఉరికే బాల్యత్వం నాకు నవ్వు తెప్పించింది.

"ఏమిటోయ్ సముద్రంప్రక్క పునాదులులేని భవంతులు కడుతున్నావు? దాంట్లో ఏ రాకుమారిని వుంచుదామని?" అన్నాను నవ్వుతూ.

"నిన్నుమాత్రం కాదు" అన్నాడు నవ్వుతూనే! నేనూ నవ్వక తప్పలేదు. కాని అత నన్నే మాట తీరులో ఏదో వ్యంగ్యం వున్నట్లు కనిపించింది. కాని అది ఇతమిత్థంగా తేలలేదు.

మసకచీకటిగా వుంది. బీచిమీద లైట్లు వెలిగాయి. విద్యుద్దీపపు కాంతి సన్నగా మా మీద ప్రసరిస్తోంది. "ఏమిటోయ్ ఇవ్వాళ ప్రపంచాన్ని జయించినట్లుంది నీ ముఖం?" అన్నాడు భానుమూర్తి కృష్ణారావుని. "నిజంగానే!" అన్నాడు కృషారావు ఇంగ్లీషులో. నా ముఖం వంక ఓరగా చూశాడు.

ఉన్నకొద్దీ చుక్కలు కనిపించకుండా పోతున్నాయి. ఆకాశాన్ని మేఘాలు కప్పేస్తున్నాయి. ఒకమోదిరి గాలి గూడా సాగింది.

"వర్షం వచ్చేట్లుగా వుందే?" అంది పద్మావతి.

"రానిద్దూ" అన్నాడు కృష్ణారావు ఆకాశం లోకి అదే పనిగా చూస్తూ.

"నీకు మల్లే మాకేమీ మహిమల్లేవు. గోవర్ధన గిరి ఎత్తి గొప్పదనం చూపేద్దామనుకొంటున్నావు గాబోలు పాపం" అంది శారద అందుకొని! ఉన్నకొద్దీ గాలి జోరవుతోంది. ఇసుక ఎత్తుగా లేస్తోంది. బీచి అంతా ఇంచుమించు నిర్మానుష్యంగా వుంది.

అందరం కార్లో ఎక్కి బయలుదేరగానే వర్షం ప్రారంభమయింది పెద్దపెద్ద చినుకులతో. దారి ప్రక్క ఎలక్ట్రిక్ లైట్లు ఒక్కసారి ఆరిపోయి బయటంతా అంధకార బంధురం చేశాయి. క్షణ క్షణం మెరిసే క్షణప్రభలు మమ్మల్ని క్షణం గ్రుడ్డివాళ్ళను చేసేస్తున్నాయి. ఉరుములు బ్రహ్మాండంగా ధ్వనిస్తున్నాయి. ఇంత తక్కువ కాలంలో ఇంత పెద్ద వర్షం వస్తుందని ఊహించను గూడా ఊహించలేదు. కోపంతో మృగరాజు గర్జిస్తే అడవి జంతువులన్నీ ఎలా వణికిపోతాయో, ఆ ఉరుములకు మేమూ అలాగే వణికిపోతున్నాం.

గట్టిగా ఉరిమి ఎక్కడో పిడుగు పడింది. నాకు స్పృహ తప్పినంత పనయింది. ఎవరికి వారికి వాళ్ళమీదనే పిడుగు పడ్డంత పనయింది. కారు ఒక్కసారిగా ఆగిపోయింది. ఐదారు నిమిషాలకుగాని ఒకరితో ఒకరు మాట్లాడుకోలేదు. భానుమూర్తి లైటు ఆర్పేసి కారు స్టార్టుచేశాడు. కాని కారు కదల్లేదు.

"అరే" అన్నాడు బాధగా.

ఆదుర్దాగా "ఏమిటి?" అంది శారద.

"ఇంకేమిటి? కారు ఆగిపోయింది. స్టార్టు కావడంలేదు" అన్నాడు భానుమూర్తి హేండిల్ మీద మోచేతులు పెట్టి.

"బ్యాటరీలైటు నీ ముందుండాలి చూడు" అన్నాడు కృష్ణారావు. భానుమూర్తి బ్యాటరీ లైటు తీసి చేతి కిచ్చాడు. టార్చి వెలుగులో కృష్ణారావు ఆ చుట్టుప్రక్కల ప్రదేశాన్నంతా ఓ నిమిషంసేపు చూసి లేచి నిలబడి కారు తలుపు తీస్తూ "నే నిప్పుడే వస్తా. ఇక్కడే వుండండి"

అని క్రిందికి దిగాడు. వర్షం జోరుగా కురుస్తోంది. గాలికి చలివేస్తో వేళ్ళన్నీ కొంకర్లు పోతున్నాయి.

"అబ్బా వద్దోయ్. ఇప్పుడెక్కడికి?" అన్నాం అందరమూను.

"ఏం ఫరవాలేదు. ఇక్కడమాత్రం యెంత సేపని వుండగలం? ఈ ప్రదేశంలోనే మా చుట్టాలు వుండాలి. వెళ్లొస్తాను" అంటూ బయలుదేరాడు. మేం చూస్తూవుండగానే తడిసి ముద్దయిపోయాడు. అరగంటలో రైన్‌కోటు తీసుకొని తిరిగివచ్చాడు. "అదృష్టం బాగుంది. మాచుట్టాలు ఇక్కడే వున్నారు. ఈ కారు ఇలా వుంచి మనం పోదాం పదండి" అంటూ తనువెంట తెచ్చిన మూడు గొడుగులు అందరికీ ఇచ్చాడు. అందరి ప్రాణాలు కుదుటపడ్డాయి. అవసానదశలో ఆశలన్నీ వదులుకున్న మానవుడికి మృత్యువు అభయ హస్తం ఇచ్చినట్లుగా ఫీలయ్యాం అందరమూను. సగం తడిసి, సగం తడవకుండా ఇంటికి చేరుకున్నాం.

ఇల్లు పెద్దదే; చుట్టూ వున్న వెడల్పయిన ప్రహారీ దాని విశాలత్వాన్ని తెలుపుతోంది. ఒక్క మెరుపు మెరిసింది. ఇంటి ఆవరణనిండా పెద్దపెద్ద చెట్లున్నాయి. ఇంట్లోకి వెళ్లేసరికి ఇంటివాళ్ళు మాకోసం కాచుక్కూర్చున్నారు. ఆ యింట్లో ఒక్క ముసలావిడ మాత్రమే వుంది.

"కృష్ణా, తమ్ముడు సత్యానారాయణ గదిలో పరుపులున్నాయి వేసుకొని దక్షిణవేపు నున్న ముందు రెండు గదుల్లోనూ పడుకోండి. రెండు గదులు సరిపోతాయా?" అంది ముసలావిడ.

"ఓ! సరిపోకేం పిన్నీ! అన్నట్టు మనవాళ్ళంతా ఎక్కడికి వెళ్ళినట్లు?" అన్నాడు కృష్ణారావు.

"మీ జగన్నాథం మావయ్య కూతురు నర్సు లేదూ? దాని పెళ్ళిట. మీ అమ్మా వాళ్ళని గూడా పిలవలేదా ఏం? ఎంత స్పర్ధయితేమటుకు. ఇటువంటి సమయాల్లోదా? ఇంటి ఆడపడుచు గదా" అని బుగ్గలు నొక్కుకుంది ముసలావిడ.

కృష్ణారావులో ఏదో బ్రహ్మాండమైన మార్పు వచ్చింది. ముఖం ఒక్కక్షణంలో గుర్తించలేనంత మారిపోయింది. ఆ ముసలావిడ ఇవేమీ గమనించినట్లు లేదు.

"ఇంకా నువ్వు పెళ్ళి కెళ్ళావు గాబోలనుకున్నాను. ఇక్కడ చదువుతూగూడా ఎన్నడూ రావేరా? మొదట్లో వచ్చేవాడివి. ఈ మధ్య అసలు మానేశావు" అంది. కృష్ణమూర్తి ఇవన్నీ వినిపించుకున్నట్లు లేదు. "పదండి" అన్నాడు తలవంచుకొని నడుస్తూ.

పరుపులన్నీ తీసుకొచ్చి మాగదిలో వేశాడు. ఓగది ఆడవాళ్ళకి ఓగది మగవాళ్ళకి. పక్కలు వేసుకొని పండుకున్నాం. బయట వర్షపు జోరు మరీ ఎక్కువైంది. ఉరుములు బ్రహ్మాండమైన శబ్దంచేస్తూ ప్రళయ భయంకరంగా ఉరుముతూనే వున్నాయి. ఆ సమయంలో అందరికీ భయంగానే వుంది. గదిలో లైటువేసేవుంచి పండుకున్నాం. నిద్ర పట్టలేదు ఎవరికీ. బయట గాలి కిటికీతలుపుల్ని తోసుకువస్తోంది. మా గదికి ఓ కిటికీకి తలుపులేదు. దానికి బదులు కృష్ణారావు ఏదో అడ్డు పెట్టాడుగాని అది కొంచెం సేపటికంటె ఎక్కువనిలవలేదు. గాలి జోరుగా వీస్తోంది. అబ్బ! వళ్ళంతా చల్లబడిపోయింది. బట్టలు సహితం చల్లగా వున్నాయి. పద్మావతి, శారద ఒకళ్ళనొకళ్లు గట్టిగా కావలించుకొని పండుకున్నారు. ఏదో ఆలోచిస్తూ పండుకున్నాను. ఇంతలో భానుమూర్తి గదిలోకి వచ్చాడు.

"ఏమిటోయ్" అన్నాను లేచి కూర్చుని.

"నిద్రపడుతోందా?" అన్నాడు.

"ఆ కిటికీతలుపు సరిగ్గాలేదు. చలివేస్తోంది" అన్నాను.

"అయితే నిద్రపట్టడం లేదన్న మాట" అని దానికి మళ్ళా ఏదో అడ్డంపెట్టాడు. ఈసారి గాలి గదిలోకి రావడంలేదు.

"మిస్ రాధా. ఇక పండుకోవచ్చు నే వస్తాను" అని అక్కణ్ణించి వెళ్ళిపోయాడు.

కళ్ళు మూసుకున్నానన్న మాటేగాని నిద్రపడితేనా? ఏమీ తోచక రూమ్ తలుపులు తీశాను. లైటుకాంతి ఎవరో వ్యక్తిమీద పడింది. ఉలికిపడ్డాను. తీరాచూస్తే కృష్ణారావే! కుర్చీలో కూర్చుని అంతచలిలోకూడా ఏదో దీర్ఘంగా ఆలో

చిస్తున్నాడు. దగ్గరికి వెళ్ళాను. అతనికి తెలిసి గూడా మెదలకుండానే కూర్చున్నాడు.

"ఏమిటి కృష్ణారావ్ ఆలోచిస్తున్నావు?" అన్నాను. అతను చాలా సేపటివరకూ ఏమీ మాట్లాళ్ళేదు. కళ్ళవెంట నీళ్లు కారుతున్నాయి. నేను ఆశ్చర్యపోయాను.

"అలా చిన్న పిల్లాడిలా ఏడుస్తారా యేమిటి ఎక్కడైనా! అసలు సంగతేమిటో చెప్పరాదూ?" అన్నాను.

"అహఁ ఏమీలేదు. నువ్వెళ్ళు రాధా!" అన్నాడు కృష్ణారావు. అతనికంఠం ఏడుస్తున్న వాళ్ళు మాట్లాడినట్లుగానే వుంది. నాకు జాలి వేసింది. ఎంత బాధ లేకపోతే అలా చిన్న పిల్లాడిలా ఏడుస్తాడు? బాధలు అందరికీ సమానమే! అటువంటి సమయంలోనే ఓదార్చాలి. లేకపోతే అఖండంగా పెరిగి ఆ బాధ విపరీత పరిణామాలకు దారి తీస్తుంది. తలమీద చేయివేసి "నాకు చెప్పవోయ్. ఫరవాలేదు" అన్నాను.

కొంచెంసేపు నిశ్శబ్దంగా గడిచిపోయింది కాలం. ఇంతకాలంలోగూడా అతని కళ్ళవెంట నిరవధిగా అశ్రువులు కారుతూనేవున్నాయి.

"నీయంతవాడైంతరువాత బాధలకి నివారణోపాయం చూసుకోవాలిగాని ఇలా ఏడుస్తూ కూర్చుంటారా చిన్న పిల్లాడిలా? ఏమిటో చెప్పు-ఫరవాలేదు" అన్నాను లాలిస్తూ.

"ఇందాక మా పిన్ని చెప్పలే నర్సుపెళ్ళని" చెప్పలేక పోతున్నాడు......"మా మేనమామ కూతురు...ఆ అమ్మాయిని నేను ప్రేమించాను. కానీ మాకూ వాళ్ళకీ మనస్పర్థలు - అందుకని నర్సుని మా మేనమామ ఇంకెవరికో ఇచ్చి పెళ్ళి చేసాడు" కృష్ణమూర్తి కుడిచెయ్యి ముడిచి కంటికడ్డంగా పెట్టుకున్నాడు. అతని పరిస్థితి చూస్తే నాకూ ఏడుపొచ్చింది. "నువ్వు ప్రేమించావా?" అన్నాను విషాదంగా. అతనిమీద నాకా సమయంలో జాలి, అనే రెండక్షరాలు తప్పితే ఏ భావమూ లేదు. కృష్ణారావు లేచి నిలబడ్డాడు. ఎక్కడో పెద్ద పిడుగుపడింది. ఏదో పెద్దచెట్టు హాహాకారంచేస్తూ రాక్షసిలా కూలిపోయింది. ఎలెక్ట్రిక్ లైట్లు ఆరిపోయాయి. గది కిటికీతలుపు విడిపోయి పెద్దగా గాలివీస్తో చెత్తా చెదారంవచ్చి మీద పడింది. అప్రయత్నంగా అతన్ని కావిలించుకున్నాను. శరీరం వెచ్చగావుంది. అతని చేతులు నా వీపును ఆర్ద్రంగా రాస్తున్నాయి. చలి వర్షపాతం, పిడుగులు, ఉరుములు వీటి ప్రభావాన్నించి శరీరం తప్పించుకుంది. అంతవరకూ చలిలో గడ్డకట్టిపోయిన రక్తమంతా హిమాలయ నదుల వేసవికాలపు వరదలకుమల్లే కరిగి వేగంగా ప్రవహిస్తోంది. ఆనందంలో అనుభూతీ, అతిభూతిలో ఆనందమూ చెప్పలేని విషమపరిస్థితి. కలలో రెక్కలొచ్చి పైకి తేలిపోతూ ఏమిటిది? "ఎందుకిలా పైకెళ్లిపోతున్నాం" అనే ప్రశ్నలకు సమాధానం వెతుక్కునే చీకటి సమస్య...పరలోకమంటూ ఇంకొకటీవుందా అని సందేహం కలిగించే విషమసమస్య! ప్రకృతి తనమీద అధికారం తీసుకున్నప్పుడు మానవచేష్టలు అసంకల్పిత ప్రతీకార చర్యలకుమల్లే తన ఇష్టానిష్టాలతో పనిలేకుండానే జరిపోతాయి గాబోలు. నాచేతులు అతని బుగ్గలను వెచ్చగా రాస్తున్నాయి. అప్రయత్నంగా.

"రాధా" అన్నాడు కృష్ణమూర్తి మత్తుగా.

చివరి క్షణాన ఆలోచించుకొంటే...పశ్చాత్తాపం మిగిలింది. ఎందుకిలా జరిగింది? ఏమో? నాకే తెలీలేదు. రేపు ప్రపంచం ముఖం ఎలా చూచేది, నైతిక విలువలు ఎంత ఉన్నత స్థానాన్నుంచి ఎలా అమాంతంగా, మనకు తెలీకుండానే పాతాళానికి దిగిపోతాయో అప్పటికి నాకర్థమయింది. మళ్ళా అంతటి స్థానాన్ని ఆక్రమించడం బ్రహ్మతరం గూడా కాదు. ఉదయం గదిలోకి ప్రవేశించిన సూర్యకిరణాల్ని చూడ్డానికి భయంవేసింది. అప్పటినుంచీ నాలో నేనే వ్యథపడుతూ ఎక్కడికీ కదిలేదాన్ని కాదు.

కొన్నాళ్ళలా గడిచిపోయాయి. జరిగిపోయిన సంఘటన ప్రయత్నంమీద కాస్తకాస్త మరుపున కొస్తోంది. స్నేహితుల బలవంతంమీద మళ్ళా ఒకరోజు బీచికి వెళ్ళడం తటస్థించింది. మళ్ళా అదే ప్రదేశం. అదే వాతావరణం. హాయిగొలిపే సముద్రపుగాలి. స్నేహితులందరూ చీలిపోయి దూరం, దూరంగా కూర్చున్నారు. ప్రొద్దుకుంకిపోతోంది. నేను ఎత్తైన ఇసుకదిబ్బమీద కూర్చుని

ఏదో ఆలోచిస్తున్నాను. బహుశా ఆనాటిరాత్రి జరిగిన సంఘటన గురించే గాబోలు...

ఎవరో భుజంమీద చెయ్యివేశారు. వెనక్కి తిరిగి చూచాను. భానుమూర్తి ముఖంలోకి చూస్తూ నవ్వుతున్నాడు, అతనికళ్లలోకి పిచ్చిగా చూచాను. అంతకంటే ఆ సమయంలో ఏమీ చెయ్యలేకపోయాను. ఆ పరిస్థితి అటువంటిది.

"జీవితం ఎందుకు?" అన్నాడు భానుమూర్తి.

సూర్యుడు ముసలివాడైనాడు. పెద్ద మబ్బు పూర్తిగా కప్పేసింది పశ్చిమాద్రిని. నేనేమీ మాట్లాడలేదు. ముఖంలో ముఖం పెట్టి, "నే చెప్పనా?" అన్నాడు. నేనా సమయంలో ఏంచేశానో తెలియదు. "ఆనందంకోసం కదూ?" అన్నాడు భానుమూర్తి. నాలో పెద్దపెద్ద కెరటాలు లేచాయి. ఉద్వేగంగా పొంగింది హృదయం. "జీవితం ఆనందంకోసం" అదే రక్తంలో ప్రతి అణువు ఘోష పెడుతోంది. భానుమూర్తి నన్ను తన వేపు తిప్పుతున్నాడు.

ఒక్కసారి నాకు ఈ క్షణికసుఖం తరువాత కలిగే వేదాంతంగుర్తుకొచ్చింది. ఆవేశం క్షణికం. ఆ క్షణంలో అది గారడీచేయిస్తుంది. బాహ్యాన్ని విస్మరింపజేస్తుంది. ఆ సమయంలో సంఘం, ప్రపంచభవిష్యత్తు ఇవేమీ గుర్తుండవు... అది కేవలం గుర్తులేకపోవడంగాదు. ఏదో అతీతమైన శక్తి వాటిని కనుమరుగు చేస్తుంది. నాకు తెలియకుండానే గర్భాల్ని లేచి చరచరా నడిచాను. కాని భానుమూర్తి నేర్పిన సిద్ధాంతం నాకుచాలా ఉపయోగించింది. జీవితం ఆనందంకోసమే ఐతే నేచేసిందాంట్లో తప్పేమీలేదు.ఇది నిజానికి చేసిన తప్పును, అనుభవం క్రింద చెలామణీ చెయ్యాలని ప్రయత్నించడమే. కాని అది మానసిక వ్యథను కొంతవరకు తగ్గించగలిగింది. మనుషులు తమ తప్పుల్ని సమర్థించుకోడానికి ఒక్కో సిద్ధాంతాన్ని గాఢంగా నమ్మాలని ప్రయత్నం చేస్తూ వుంటారు.

వివాహం జరిగిపోయేంతవరకూ ఈ సిద్ధాంతం బాగానే పనిచేసింది. మావార్ని నువ్వు చూచావుగా? ఏనాడో నే నోచిన నోములఫలం. బాహ్యంగా ఎంత స్ఫురద్రూపో అంతర్యంగూడ అంత సుకుమారమైంది. ఆ విషయం నానోటితో చెప్పే అర్హత లేదక్కా!

ఎప్పుడూ ఏవేవో పుస్తకాలు చదువుతారు. నాకు చేసేపనులేవీ వుండవు. ఎప్పుడైనా వారి గది లోకి వెళతాను.

"రా! రాధా..." అంటారు.

"ఏవన్నా పుస్తకాలు కావాలా?" అంటారు. నాకక్కరలసినవి తీసుకుంటాను. దేనిమీదైనా తర్కం మొదలు పెట్టారంటే దాని అంతం తెలుసుకొనేవరకూ వూరుకోరు. ప్రొద్దుకూకిందంటే సర్వం నా అధీనమైపోతారు. వారు నావంక గోముగాచూస్తే "నాకు నువ్వుతప్ప ఈ ప్రపంచంలో ఎవరున్నారు రాధా!"అన్నట్లువుంటుంది. వారుచాలా పుస్తకాలు రాశారు. అవన్నీ సైన్సుకు సంబంధించినవి. వారినిచూస్తే నా కరుడుకట్టిన భావాలు మంచుపై సూర్యకిరణాలు ప్రసరించి నప్పుడు కరిగిపోయినట్లుగా కరిగిపోతాయి. చివరికి జాలిమిగులుతుంది. అది వ్యథగా మారుతుంది. ప్రతినిమిషం నా నైతికపతనం నన్ను కదిలించివేస్తుంది.

"జీవితం ఎందుకు?" ప్రశ్న వేసుకున్నాను.

"ఆనందంకోసం" భానుమూర్తి చెప్పిన సమాధానం. ఆనందమనేమాటకు సరైన అర్థానివ్వకుండా చెడర్థాన్ని కల్పిస్తున్నాం! ఆనందంకోసం చేసే ప్రతిపనీ మంచిదేనా? ఆయననన్ను గౌరవిస్తుంటే నేను సహించలేను. వారు నన్నెందుకు గౌరవించాలి? నన్ను సహ్యించుకోవాలి. అప్పుడు సుఖంగా వుంటుంది.

ఓ రోజు షేక్స్పియర్ హేమ్లెట్, చదివి ఉద్వేగంతో వారిగదిలోకివెళ్ళి "హేమ్లెట్ చేసినపని ఎలా వుందంటారు?" అని అడిగాను.

"అతని మనస్తత్వానికి సరిపోయినట్లుగా వుంది" అన్నారు.

"అంతేనా. అతని ఉద్దేశ్యంలో మాత్రమే తల్లి నీచురాలని మీ వుద్దేశ్యమా?"

"కావచ్చు!"

"అంటేమీరామెను సమర్థిస్తున్నారన్నమాట"

"అది అపరాధమేమీ కాదనుకుంటాను"

"ఎందుకని?"

"మానవులు పరిస్థితుల చేతుల్లో కీలుబొమ్మలనే విషయాన్ని నువ్వు గ్రహించే వుంటావు. ఆ దృష్టితో ఆలోచించు. ఆమె ఆ విధంగా మరిదిచే భర్తను హత్యచేయించిదనే పైవిషయం మనం ఆలోచిస్తూన్నాంగాని — అలా జరగడానికి వెనుక జరిగిన సంఘటనలు మనం ఆలోచించడానికి ప్రయత్నం చెయ్యడంలేదు. మానవ సహజావేశాలనుంచి ఆమె మనహాయింపు కాదుగా! ఎన్నెన్ని సంఘటనలు ఎంత ప్రగాఢంగా పనిచేశాయో. కాలం మానవుణ్ని నడిపిస్తుంది. ఇంకోసమయంలో నైతే ఆమె భర్తకు తనుచేసిన ద్రోహానికి పశ్చాత్తాపపడేదేమో ఎవరికి తెలుసు?" ఇదీ సమాధానం!!

"తప్పులు చేసేవార్ని మీరు ద్వేషించరన్న మాట?"

"దానికి కారణవుంది. తప్పుచెయ్యకుండా మానవుడు బ్రతకలేడు. మరణించడం గూడా ఓ తప్పే అవుతుంది. మానవజన్మకి ఈతప్పులు మినహాయింపు. అసలు మానవత్వాన్ని లెక్కించేప్పుడు ఈ తప్పులపట్టికంతా కలిపి లెక్కవెయ్యాలి. సినిమా నటులికి స్వేచ్ఛ, కొంతవరకు తమ ఇష్టాను సారంగా సంచరించడం సహజం. దాన్ని మనం వారిలో లోపాలుగా లెక్క తీసుకోగూడదు. అలా లేకపోతే వాళ్ళసలు ఆ రంగంలో రాణించలేరు. అలాగే ఈ మానవత్వానికీ కొన్నికొన్ని తప్పులు బోర్డర్‌గా వదిలేయాలి!"

"వ్యభిచరించేవాళ్లని ఒప్పుకుంటారా?"

"నాకు జాలికలుగుతుంది. క్షణిక ఆవేశాలు మానవుణ్ణి పరాధీనుణ్ణి చేస్తాయి. అటువంటి పరిస్థితుల్లో ఎవరూ తప్పించుకోలేరు. మానవ నిర్మాణమే అలాటిది. ఈ పరిస్థితులకి లొంగిపోయే దౌర్బల్యం కలిగివున్న మానవత్వాన్ని చూస్తే జాలిపడక కోపంవస్తుందా?"

నాకు ఏడుపు పొర్లిపొర్లి వస్తోంది. వారికాళ్ల మీదపడి ఎన్నాళ్ళనుంచో అణుచుకునివున్న దుఃఖాన్ని నేనేమీ ఆపలేకపోయానా సమయంలో! వెల్లువగా వెల్లుబడే ఏడుపునకు ఆయన క్షణంసేపు నివ్వెరపోయారు.

"అటువంటి అభాగ్యురాల్ని నేనే" అన్నాను ఎలాగో మాట పెగుల్చుకొని. వారు క్షణంసేపు నిశ్చలంగా కూర్చున్నారు.

"నన్ను క్షమిస్తారా?" అన్నాను.

"నిన్ను ప్రేమించలేనని భయంగావుందా?" అన్నారు నా కన్నీళ్ళు తుడుస్తూ.

"నేనిలా బ్రతకలేను" అన్నాను మళ్ళీ.

"ఆ తరువాత నా విషయంగూడా నువ్వే ఆలోచించి చెప్పాలి" అన్నారు ఆయన.

విధిలేక బ్రతకాల్సి వచ్చిందక్కా! వారి ప్రవర్తనలో ఏమార్పూ లేదు. ఆరాత్రల్లా వారి ఓదార్పుతోనే గడిచిపోయింది. వారు ప్రేమగా నావేపు చూస్తే నాకు మంటల్లో పడ్డట్లుగా వుంటుంది. వారొక శ్రేష్ఠమైనమంట. ఆ జ్వాలల వేడికి ఈ తుచ్ఛ శరీరం ఓర్చుకోలేదు. దహించివేస్తాయి ఆ జ్వాలలు. ఏ సముద్రపు అడుగునో కూర్చోవాలనిపిస్తుంది.

ఇంతకాలంవరకూ ఎలాగో బ్రతగ్గలిగాను. అదయినా నావంటి మొండిజీవిగనక. ఆ ప్రేమ ముందు నేను క్షణంసేపైనా నిలవలేను. నాకు ఆత్మహత్యకంటె గత్యంతరం కనిపించడంలేదు.

నేనంతగా విశేషించి నీతో ఏమీ చెప్పదలుచుకోలేదు. పరిస్థితులవిషయం ప్రతివారికీ తెలుసు. వాటిని జయించలేని దౌర్బల్యంగూడా మానవుల్లో వుందని తెలుసు. అవి అంతగా తోసుకొస్తే మనం చేయగలిగిందేవుండదు. కాని మనుషులు చేయవలసింది ఆ పరిస్థితులు రాకుండా చూచుకోవడం. తమ దౌర్బల్యం తమకు తెలిసినప్పుడు ఎందుకా దౌర్బల్య ప్రభావాన్ని పొందకుండా వుండడానికి ప్రయత్నంచెయ్యగూడదా? తాము చేసిన ప్రతి పొరపాటునూ అనుభవాల క్రింద చలామణి చెయ్యడం ఈ నాగరిక ప్రపంచంలో బాగా అలవాటైపోయింది. ఈ కన్నీటి గాథ విన్నతరువాత కనీసం నీ పిల్లలపైనన్నా సరైన జాగ్రత్త తీసుకుంటావనుకుంటాను.

ఈ సమయంలో వార్ని గురించి చింతతప్పితే నాకింకేమీ బాధలేదు. అవకాశం విధాత కల్పిస్తే ఇంకో లోకంలో కలుసుకోగలమేమో! అంతే.

చివరి నమస్కారం చెయ్యనివ్వు. వుంటాను.

ఇట్లు,

అభాగిని-రాధ.

★